క్లుప్తంగా

దేవాలయ వార్షికోత్సవం

సోంపేట: పలాసపురం గ్రామంలోని భద్రకాళీ దేవాలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు వితరణ

మందస: మందస మండలం కేంద్రంలోని బస్‌స్టాండ్‌లో గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్(విజయనగరం), మదర్ చారిటబుల్ ట్రస్ట్ (సోండిపూడి,మందస) ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల ఎంపిక శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 28 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేసినట్టు జిల్లా కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షుడు రట్టి లక్ష్మణరావు తెలిపారు.

జయకృష్ణాపురంలో వైద్య శిబిరం

టెక్కలి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా టెక్కలి మండలం జయకృష్ణాపురం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో గ్రామానికి చెందిన వేప పోలమ్మ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు తమ్మినేని ఆనందరావు నేతృత్వంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి మందులను అందజేశారు. అలాగే టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బీజేపీ మండల అధ్యక్షుడు జర్జాన రామ్‌జీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

సూదికొండ కాలనీలో అన్నదానం

పలాస: దసరా శరన్నవరాత్రులు సందర్భంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండకాలనీ కొత్తమ్మ తల్లి ఆలయం వద్ద దుర్గాభవానీ పూజా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నప్రసాద వితరణ జరిగింది. వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిష్టు గోపి, సీపాన ఈశ్వరరావు, బగాది సింహాచలం, కోనారి ఆదిభవాని పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘననివాళి


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాఠకులు

టెక్కలి: టెక్కలి శాఖా గ్రంథాలయంలో భగత్ సింగ్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.రూపావతి ఆధ్వర్యంలో పాఠకుల సమక్షంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

సనత్‌కుమార్‌కు యువ సాహితీ అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న సనత్‌కుమార్

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కోసంగిపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసి.. సాహితీవేత్త కొల్లి సంపత్‌కుమార్‌కు ×సిక్కోలు సరదాపురం సరదాలు₹ సిరీస్ రచనకు ప్రతిష్ఠాత్మక యువ సాహితీ కిరీటం పురస్కారం వరించింది. హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సాహితీ పట్టాభిషేక మహోత్సవంలో అవార్డును శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేసి అభినందించారు.

నాయకుల పరామర్శ

సోంపేట: గొల్లూరు ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి ఝాన్సీ అత్త కామమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు , ఎంపీపీ నిమ్మన దాస్ ఆదివారం పరామర్శించారు. పిన్నింటి రేఖరావు, సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు, ధర్మారావు ఉన్నారు.

కంచిలి: జలంత్రకోట పంచాయతీ పరిధి మధుపురం గ్రామానికి చెందిన డొక్కర దండాసి లారీ ఢీకున్న ప్రమాదంలో మృతి చెందారు. మృతుడు జలంత్రకోట పంచాయతీ సర్పంచ్ బ్రహ్మానందం తండ్రి కావడంతో ఆయనను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు పరామర్శించారు.

అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం

పలాస: పలాస రైల్వే క్రీడా మైదానంలో ఆదివారం అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంటు ప్రారంభమైంది. గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, రైల్వే శ్రామిక కాంగ్రెస్ నాయకుడు సిర్ల రాజశేఖర్ పోటీలను ప్రారంభించగా.. మొత్తం పది జట్లు తలపడుతున్నాయి. మొదటి రోజు పలాసపై నరసన్నపేట గెలిచింది. అలాగే శ్రీకాకుళం–భువనేశ్వర్ మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో భువనేశ్వర్ విజయం సాధించింది. ఈస్టు కోస్టు రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్ నాయకులు పి.వి.వి.రావు, విక్రమ్ రామారావు, రవి చౌదరి, ఆర్.భాస్కరరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇలియాష్ అహ్మద్, కోచ్‌లు జగదీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

కంచిలి: కంచిలి పంచాయతీ పరిధి మఠం కంచిలి శ్మశానవాటికలో సిమెంటు డ్రైనేజీ నిర్మాణానికి రూ. 5 లక్షలు, మరుగుదొడ్లు నిర్మాణానికి రూ. 5 లక్షల నిధులు స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి మంజూరు చేశారు. సిమెంటు డ్రైనేజీ నిర్మాణ పనులు ఆదివారం నుంచి ప్రారంభించగా.. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు పరిశీలించారు.

అదును దాటినా అందని ఎరువు!

- ఇప్పటికీ పూర్తిస్థాయిలో పంపిణీ కాని యూరియా
- పంటకు వేయలేకపోయిన రైతులు
- దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన


యూరియా వేయకపోవడంతో ఎదుగుదలలేని వరి పైరు


బేసిరామచంద్రాపురంలో యూరియా కోసం రైతుల పాట్లు (ఫైల్)

సోంపేట: ఖరీఫ్ సీజన్‌లో వరిపంట సాగు చేస్తున్న రైతులకు ఎరువుల కష్టాలు ఇప్పటికీ తీరలేదు. కావాల్సిన ఎరువులు అవసరమైన సమయంలో అందుబాటులో లేక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా పైరుకు జీవాన్నిచ్చే యూరియా కొరత అన్నదాతను వేధిస్తోంది. సోంపేట మండలంలో ఈ ఏడాది ఆలస్యంగా వరి నాట్లు మొదలయ్యాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ పదో తేదీ వరకు వరినాట్లు వేశారు. సుమారు పదివేల ఎకరాల్లో ఈ ఖరీఫ్‌లో వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరినాట్లు వేసిన తరువాత భాస్వరం ఎరువు డీఏపీ 50 కిలోలు, యూరియా 25 కలిపి వేసుకునే వారు. మండలానికి ఈ ఏడాది డీఏపీ సకాలంలో సరఫరా కాలేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి బస్తా సుమారు రూ.1700 వెచ్చించి కొనుగోలు చేశారు. మండలానికి ఆలస్యంగా 258 టన్నుల డీఏపీ చేరుకుంది. ఇది కేవలం ఐదు వేల ఎకరాలకు మాత్రమే సరిపోయింది. మిగతా రైతులు డీఏపీ సరైన సమయానికి అందక పోవడంతో యూరియా వాడకాన్ని చేపట్టారు. ప్రభుత్వం యూరియా వాడకాన్ని తగ్గించాలని చెబుతున్నా దానికి అనుగుణంగా డీఏపీ, పోటాష్ ఎరువులు సరఫరా చేయడం కూటమి సర్కార్ విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ ప్రారంభం సమయంలోనే వలంటీర్లు , రైతుభరోసా కేంద్రాల సిబ్బంది ద్వారా రైతులకు అవసరమై విత్తనాలు, ఎరువులు తరలించి ఇబ్బంది లేకుండా చేశారు. దీంతో రైతులకు గత ఐదు సంవత్సరాలు ఇబ్బందులు తప్పాయి. అయితే కూటమి సర్కార్ హయాంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట పొలాలకు వెళ్లే సమయం కంటే యూరియా కోసం కార్యాలయాల వద్ద ప్రదక్షిణలు చేయడమే ఎక్కువైందని రైతులు మండిపడుతున్నారు.

ప్రభుత్వ వాదన..

రసాయన ఎరువులు ఎక్కువగా వాడడం వలన నేల ఆరోగ్యానికి, మానవ ఆరోగ్యానికి నష్టం కలుగుతుందని వ్యవసాయాధికారులు, ప్రభుత్వ పాలకులు కొత్త పల్లవి అందుకున్నారు. గతంలో ఇలాంటి వాదన ఎప్పుడూ లేదు. ఎరువులు సరఫరా చేయడం చేతకాకపోవడంతోనే ఈ రకమైన ప్రచారం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటకు అవసరమైన ఎరువు ఎకరానికి 75 కిలోలు వాడమని అధికారులు అవగాహన కల్పిస్తుండడంపై చిర్రుబుర్రులాడుతున్నారు.

వాడకం 75 కిలోల కంటే తక్కువే

రైతులు ఎప్పటినుంచో ఎకరానికి 75 కిలోల కంటే తక్కువ యూరియానే వాడుతున్నారు. ప్రభుత్వం కూడా ఆ విధంగానే రైతులకు యూరియాను సరఫరా చేస్తుంది. ప్రస్తుతం అదునకు తగ్గట్టుగా రైతులకు యూరియా అందజేయడంలో విఫలమైన ప్రభుత్వం ఎక్కువగా యూరియా వాడుతున్నారని కొత్తరాగం అందుకున్నారు. వరి సాగులో ఎక్కువగా పచ్చిరొట్ట సాగు చేయడంతో పాటు భాస్వరం, పోటాష్, యూరియా సమపాలలో వాడుతుంటామని రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుత సర్కార్ ఎకరాకు అందజేయాల్సిన 75 కిలోల యూరియా కూడా సరఫరా చేయలేకపోయిందని ఆరోపిస్తున్నారు. అదును దాటిన తరువాత ఏ ఎరువు వేసిన పంటకు ప్రయోజనం ఉండదని అంటున్నారు. ఎరువులు సకాలంలో పంటకు వేయకపోవడంతో వరిదుబ్బు ఎదుగుదల లేక దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం విఫలం



పంటకు అవసరమైన సమయంలో యూరియా అందజేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. అదును ప్రకారం పంటకు ఎరువు వేయకపోవడంతో పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికీ యూరియా కోసం వ్యవసాయ కార్యాలయాలు, రైతుసేవా కేంద్రాలు చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం, వ్యవసాయాధికారులు స్పందించి సకాలంలో యూరియా అందజేయడానికి చర్యలు తీసుకోవాలి.

–బుద్దాన శ్రీకృష్ణ, రైతు, బేసిరామచంద్రాపురం

రైతులు ఇబ్బందులు



వరి పంటకు వేసేందుకు యూరియా దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అవసరమై ఎరువు సకాలంలో అందకపోవడం దారుణం. పొలాలకు వెళ్లి పైరు చూసుకోవాల్సిన రైతులు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. అధికారులు, ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమై ఎరువులు సకాలంలో సక్రమంగా అందజేయాలి.

–కర్రి సత్యం, రైతు, బారువ

చర్యలు తీసుకుంటున్నాం



రైతులకు అవసరమై ఎరువులు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. సోంపేట మండలంలో రెండు దశల్లో వేయడానికి సుమారు 500 టన్నులు యూరియా అవసరం కాగా ఇప్పటికే 400 టన్నులు అందజేశాం. ఒకటి రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో సరఫరా చేసి రైతుల ఇక్కట్లు తీరుస్తాం.

– బి.నర్సింహమూర్తి, వ్యవసాయాధికారి, సోంపేట

మందసకు వంశ‘ధార’ తేవాలి

- సాధన కమిటీ డిమాండ్


సమావేశంలో పాల్గొన్న సాధన కమిటీ ప్రతినిధులు

మందస: మందస మండలంలోని ప్రతీ గ్రామానికి వంశధార రిజర్వాయర్ ద్వారా సాగునీటిని అందించాలని సాధన కమిటీ డిమాండ్ చేసింది. హరిపురం గ్రామంలో మార్పు గ్రంథాలయంలో 28వ వంశధార సాగునీటి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ పలు నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామాల్లో పర్యటన చేయాలని, సాగునీటి కోసం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టాలని, అలాగే గ్రామ పంచాయతీల్లో తీర్మానాలు చేయాలని కమిటీ సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. ఇప్పటి వరకు జరిగిన గ్రామసభలలో రైతులు స్పందన, ఉద్యమం బలోపేతానికి రైతులు సహకరిస్తామని అన్నారు. సమావేశంలో అధ్యక్షులు మార్పు మన్మథరావు, ఉపాధ్యక్షులు ధర్మార్పు వెంకట్రావు, నల్ల హడ్డి మాస్టార్, కోర్ల హేమారావు చౌదరి, దుంపల వైకుంఠరావు, కోర్నాన గంగాధర్, అంపోలు త్రినాథ్, మజ్జి బాబూరావు, పెద్దంటి శేఖర్, కొవ్వూరు దశరథి, పూలారి దుర్యోధన, ఉగ్రపిల్లి సోమనాథం పాల్గొన్నారు.

హిందీతో జాతీయ ఐక్యత


ప్రయాణికులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: భారతదేశాన్ని ఐక్యం చేసే ఏకైక భాష హిందీ అని హిందీభాషా ప్రచారకులు నిరంజన్, నాగేశ్వరరావులు అన్నారు. హిందీ భాషా పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు హిందీభాషాలో ఉన్న పురాన, పురాణగాధలు, డీఎస్సీ, బీఈడీ, డీఎడ్ పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హిందీ భాషా ప్రచారకులు ప్రయాణికులతో మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌ని అవసరం మేరకే వినియోగించాలని, అధికంగా పుస్తకపఠనానికి సమయం కేటాయించడం వల్ల జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో డి.శ్యామ్, కె.నీలకంఠం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పీఎం స్వానిధి లోకకల్యాణ్ మేళా

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పీఎం స్వానిధి లోకకల్యాణ్ మేళాను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వీధి వ్యాపారులకు రూ. 10 వేల నుంచి 50 వేల రూపాయల వరకు రుణాలు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే వ్యాపారులకు యూపీఐ లింక్, రూపే, క్రెడిట్ కార్డు మంజూరుపై అవగాహన కల్పిస్తామన్నారు.

సచివాలయాలను నిర్వీర్యం చేస్తున్న సర్కార్

- పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి
- మండల సమావేశంలో ఎమ్మెల్సీ రామారావు


ఎమ్మెల్సీ రామారావును సన్మానిస్తున్న ఎంపీపీ దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు యశోద తదితరులు

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు విశేష సేవలందించిన వీటికి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుండడంతో ప్రజలకు సేవలు అగమ్య గోచరమయ్యావన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సాగునీటి కాలువల దుస్థితితోపాటు ఆస్పత్రుల్లో నెలకున్న సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించినట్టు చెప్పారు. మండలంలోని సమస్యలు తెలియజేస్తే చట్టసభల్లో చర్చించి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామన్నారు. అధికారులు ప్రోటోకాల్ గుర్తించి స్థానిక ప్రజాప్రతినిధులను గౌరవించాలని సూచించారు. ఎంపీపీ దాస్ మాట్లాడుతూ.. అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికీ రైతులు యూరియా కోసం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతభరోసా కేంద్రాల ద్వారా ప్రతీ రైతు వద్దకు సిబ్బంది వెళ్లి కావాల్సిన ఎరువులు గుర్తించి సకాలంలో అందజేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం యూరియా అధికార పార్టీ నాయకులకే అందుతుందని ఆరోపించారు. సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని మండలస్థాయి అధికారులకు మెమోలు అందజేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. సుంకిడి, ఉప్పలాం సర్పంచ్‌లు శిలగాన భాస్కరరావు, బట్టి మాధవరావు మాట్లాడుతూ.. 2014–19 కాలంలో వేసిన విద్యుత్ బల్బుల బకాయిలు చెల్లించాలని పంచాయతీలకు ఒత్తిడి చేయడం దారుణం అన్నారు. సుమారు ఆరేళ్ల క్రితం బకాయిలు ఇప్పుడు చెల్లించాలని పంచాయతీలకు నోటీసులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ఇటీవల పంచాయతీ ఖాతాల్లో జమచేసిన 15వ ఆర్థిక సంఘ నిధులు బకాయిలు చెల్లించడం, క్లాప్ మిత్రల జీతాలకే సరిపోతాయని వాపోయారు. పూర్తి సమాచారం అందజేస్తే విద్యుత్ బల్బు బిల్లుల బకాయిలు చెల్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు. డిప్యూటీ ఎంపీడీవో వెంకటరావు మాట్లాడుతూ.. 2014–19 కాలంలో పంచాయతీలకు ఈఈఎస్ఎల్ సంస్థ విద్యుత్ బల్బులు సరఫరా చేసిందని, దాని బకాయిలు చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, సోంపేట ఎంపీటీసీ సభ్యుడు పాడుగు కామేష్ మాట్లాడుతూ.. సోంపేట పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఏర్పాటు చేసుకున్న చిన్న షెడ్‌ను రాజకీయ కక్షతో తీయడం ఎంతమాత్రం సబవు కాదన్నారు. అధికారులు ఉద్దేశపూర్వకంగా షెడ్‌ను తొలగించడం దారుణం అన్నారు. పంచాయతీ ఈవో శాంతి కుమారి మాట్లాడతూ.. అతని వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేవని, ప్రభుత్వం ఐసీడీఎస్ ప్రాజెక్టు భవనానికి ఆ స్థలాన్ని కేటాయించడంతో షెడ్ తీయాల్సిన పరిస్థితులు వచ్చాయని వివరణ ఇచ్చారు. సోంపేటలోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు ఇదేవిధంగా తొలగించాలని ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. పలాసపురం సర్పంచ్ తడక జోగారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఇంటి స్థలాలు ఇచ్చినవారు ఇప్పుడు ఇళ్లు నిర్మించుకుందామంటే నిలుపుదల ఎందుకు చేస్తున్నారని హౌసింగ్ జేఈ రవిని ప్రశ్నించారు. దీనికి జేఈ బదులిస్తూ అటువంటి పరిస్థితి లేదని.. ఎవరైనా నిర్మాణాలు పూర్తి చేసుకోవచ్చునన్నారు. బారువ మేజర్ పంచాయతీ సర్పంచ్ యర్ర రజనీ, వైస్ ఎంపీపీ గురాల శ్రీను మాట్లాడుతూ.. బారువ మేజర్ పంచాయతీలో సచివాలయాల్లో సిబ్బంది కొరత ఉందని, సిబ్బంది పూర్తి నియామకం చేపట్టాలన్నారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మాట్లాడుతూ.. రైతులు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విష్ణు మాట్లాడుతూ.. త్వరలో జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేసి ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తామన్నారు. శాసన మండలిలో నియోజకవర్గ సమస్యలు లేవనెత్తి పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు ఎమ్మెల్సీ నర్తు రామారావును ఎంపీపీ దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, పలువురు సభ్యులు దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.

సత్యసాయి వేడుకలు



కవిటి మండలం చండిపుట్టుగలో భగవాన్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సత్యసాయి శతజయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున నగరసంకీర్తన అనంతరం పతాకధ్వజ ఆవిష్కరణ జరిపారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఏకాహం భజనకాలక్షేపం చేశారు. పలువురు పేదలకు వస్త్ర సాయం చేశారు.

–కవిటి

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు


సోంపేట: చండికాదేవిగా సోంపేట సోమపోలమాంబదేవి


వజ్రపుకొత్తూరు రూరల్: కొత్తూరు పోలమ్మ అమ్మవారి సన్నిధిలో మహిళల సామూహిక కుంకుమ పూజలు


కవిటి: గొండ్యాలపుట్టుగలో అమ్మవారికి గాజుల అలంకరణ


ఇచ్ఛాపురం: నీలకంఠేశ్వరాలయంలో శాకంబరిదేవీ అవతారంలో పార్వతీదేవి

దేవి నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఏడో రోజైన ఆదివారం అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనం ఇవ్వగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ పూజల్లో మహిళలు అధికంగా పాల్గొన్నారు. దుర్గా మండపాల వద్ద సాంస్కృతిక నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు.

–సాక్షి నెట్‌వర్క్

బాధితులకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త పేరాడ తిలక్, నాయకులు

- ప్రతీ కక్ష సాధింపును నమోదు చేస్తాం
- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త తిలక్

టెక్కలి:

గ్రామాల్లో కూటమి కార్యకర్తల కక్ష సాధింపు చర్యలపై బాధితులకు అండగా డిజిటల్ బుక్ ఎంతో భరోసాగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించి డిజిటల్ బుక్‌పై అవగాహన కల్పించడంతో పాటు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కూటమి నాయకుల కక్ష సాధింపు చర్యలకు న్యాయపరంగా సమాధానం చెప్పడానికే పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను రూపకల్పన చేశారని వెల్లడించారు. కూటమి నాయకుల ప్రమేయంతో అధికారులు చేస్తున్నటువంటి అన్యాయమైన చర్యలకు రక్షణ కోసమే డిజిటల్ బుక్ రూపకల్పన చేశారని, ఎట్టి పరిస్థితుల్లో రాజకీయ కక్ష కోసం కాదని స్పష్టం చేశారు. కూటమి నాయకులు చెప్పారంటూ పోలీస్, రెవెన్యూ, గ్రామస్థాయిలో ఇతర శాఖల అధికారులు కక్షకట్టి చేస్తున్న ప్రతీ అడ్డగోలు చర్యకు డిజిటల్ బుక్ ద్వారా సరైన సమాధానం చెబుతామన్నారు. నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రోత్సాహంతో అదే సామాజిక వర్గానికి చెందిన అధికారులు చేస్తున్న ప్రతీ కక్షసాధింపు చర్యను బుక్‌లో నమోదు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే ప్రజలకు మద్దతుగా చేపట్టిన కార్యక్రమాలకు అన్నివర్గాల ప్రజల నుంచి ఎంతగానో స్పందన వచ్చిందని గుర్తు చేశారు.

మంత్రి అండతో క్రషర్లు మూయించేశారు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో టెక్కలి నియోజకవర్గంలో అడ్డగోలుగా క్రషర్లు మూయించేశారని తిలక్ గుర్తు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు అండతో పెద్ద ఎత్తున మైనింగ్ అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా గ్రావెల్ తవ్వకాల ద్వారా మెటీరియల్ మొత్తం పోర్టుకు తరలిస్తున్నామని అధికారులు చెబుతున్నారని అయితే ఇప్పటి వరకు జరిగిన తవ్వకాలు, పోర్టుకు వెళ్లిన మెటీరియల్, ప్రభుత్వం నుంచి వచ్చిన బిల్లులు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు అండతో చేస్తున్న మైనింగ్ అక్రమాలు, మైన్స్ అధికారుల కక్ష సాధింపు చర్యలపై అక్టోబర్ ఆరో తేదీన పెద్ద ఎత్తున టెక్కలి మైన్స్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని దీనికి బాధితులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కష్టకాలంలో తనతో పాటు పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతీ కార్యకర్తను గుండెలో పెట్టుకుంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, మండల కన్వీనర్లు ఎస్.హేమసుందర్‌రాజు, బుడ్డ మోహన్‌రెడ్డి, తమిరె ఫాల్గుణరావు, నాయకులు సత్తారు సత్యం, తమ్మన్నగారి కిరణ్, ఎన్.సత్యరాజ్, ఎం.గణపతిరావు, ఎ.రాహుల్, రవికుమార్ గాంధీ, పి.వెంకటరావు, ఆర్.రామిరెడ్డి, కె.అజయ్, జి.మోహన్‌రెడ్డి, ఆర్.జయమోహన్, డి.రామకృష్ణారెడ్డి, కె.కామేష్, పోలాకి మోహన్, నర్సింగ్‌నాథ్ సాబతో, బి.కార్తీక్, బి.రాజేష్, తమ్మయ్య, ఎస్.వాసు, జి.సోమేష్, ఎ.విష్ణు, బి.వెంకటరమణ, బి.గోపాల్, టి.జగ్గారావు, ఆర్.మురళీరెడ్డి, ఎస్.బాలకృష్ణ, కె.సూర్యం, డి.లోకేష్‌రెడ్డి, బి.ఉదయ్, కాళ్ల సంజీవ్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్యపోరాటాలే శరణ్యం



ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

మందస: హక్కుల సాధనకు ఐక్యపోరాటాలే శరణ్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నాగమణి, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పిలుపునిచ్చారు. సీఐటీయూ మందస మండల మహసభ మందసలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మందస హైస్కూల్ జంక్షన్ నుంచి కొత్తవీధి వరకు సీఐటీయూ మండల కన్వీనర్ కె.కేశవరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ.. జీడి, రైస్ మిల్లు కార్మికులు తీవ్ర శ్రమ, ఆర్థిక దోపిడీకి గురవుతున్నారన్నారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మట్ట ఖగేశ్వరావు, కన్వీనర్లుగా ఆర్.దేవేంద్ర, ఎస్.వల్లభరావు, కమిటీ సభ్యులుగా కె.కృష్ణారావు, మల్లేష్, ఆర్.ఏకాశి, జి.బాలమ్మ, బి.చంద్రమ్మ, బి.భారతి నియమితులయ్యారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు తెప్పల అజయ్, జగదీష్ బడీత్య, దిలీప్ కూమార్, షణ్ముఖరావు పాల్గొన్నారు.